# వనమాలి

- ఆర్.వి.చలపతి

సత్యనారాయణగారు మెల్లిగా కళ్ళు తెరిచారు. ఇంకా పూర్తిగా తెల్లవారనే లేదు. అప్పడే అన్ని వాకిళ్ళలోనూ ఆడవాళ్ళు హడావిడి చేసేస్తున్నారు. ముందురోజు రాత్రి పడుకోబోయేముందు ఆయన అనుకున్నారు మరునాడు ఆలస్యంగా లేవాలని. అసలు నిద్రపోతేగా లేవడానికీ, లేవకపోవడానికీ! రాత్రంతా ఆలోచనల సుడిగుండాలలో చిక్కుకుని, సుళ్ళు తిరిగి, అలసిపోయి ఏ నాలుగు గంటలకో ఒక రకమైన మగతలోనికి జారిపోయారు. ఆ మగతలోనూ ఆలోచనలే! ఇప్పటికైనా అందులోంచి బయట పడకపోయేవారే భార్య కంఠం వినిపించకపోతే.

"కాఫీకి పాలు పడేశాను స్టవ్‌మీద. లేచి మొహం కడుక్కోరూ?" అంటూ వచ్చింది వరలక్ష్మి.

"ఈ రోజు కాఫీ స్ట్రాంగ్‌గా తాగాలని వుంది, వరం!" అన్నారాయన చిన్నపిల్లాడిలా.

ఆయన మామూలుగా కాఫీ చాలా లైట్‌గా తీసుకుంటారు, మురిపెంగా చూసింది వరలక్ష్మి.

"ఏమిటీ విశేషం?''

"పిచ్చిదానా! రాత్రంతా నేను కునుకు తీశానంటావా? లేదు. వరం! గడచిన రాత్రి నాకు శివ రాత్రి. జీవిత శేషాన్ని గురించి ఆలోచన చేయాల్సిన సమయం కావడమే యీ రోజు విశేషం.''

"సర్లెండి. ఈ రోజు మీరు రిటైరవబోతున్నారని నేనేమీ మరచిపోలేదు. అయితే తొందరగా తెమలండి. చివరి రోజునా, అదీకాస్త తొందరగా వెళ్ళరుగానీ'' అంది వరలక్ష్మి.

నిజానికి ఆయన తన సర్వీసులో ఆలస్యంగా వెళ్ళిన దినమూ లేదు, అత్యవసరమైతే తప్ప సెలవుపెట్టిన దినమూ లేదు. ఉదయం తొమ్మిదింటికి భోజనం ముగించి బడికి వెళ్ళారంటే యింటి జ్ఞాపకమే వుండదు. పసిపిల్లల మధ్య తనూ ఒక పిల్లవాడిలా కబుర్లు చెబుతూ, వాళ్ళను నవ్విస్తూ, నవ్వుల మధ్యనే చెప్పవలసిన పాఠాలు చెబుతూ, అందరికీ అర్థమయిందా, లేదా అని పేరుపేరునా అడిగి తెలుసుకొని, అర్థం కాని వాళ్ళకు యింకా విడమర్చి చెబుతూ, లేదా సాయంత్రం యింటి దగ్గర వచ్చి కలవమని చెబుతూ, తనకు క్లాసు లేని సమయాలలో కూడా విశ్రాంతి తీసుకోక ఉపాధ్యాయుడు రాని మరో తరగతి యేదైనా వుంటే అక్కడికి వెళ్ళి వాళ్ళకు కావలసినవి చెబుతూ, తిరిగి సాయంత్రం యింటికి రాగానే, యింటికి వచ్చిన విద్యార్థులకు అర్థం కానివి చెబుతూ.... యిలా చెబుతూ, చెబుతూ, చెప్పడమే జీవితంగా, బోధించడమే వూపిరిగా వున్న ఆయనకు సెలవు పెట్టి యింట్లో కూర్చోడానికి మనసెలా వొప్పుతుంది!

భర్త మనసు తెలిసిన వరలక్ష్మి ఆయనకు తొందరగా తెమలమని అన్నందుకు నాలుక్కరచుకొంది.

సత్యనారాయణగారు కొంత సేపు అలాగే కూర్చున్నారు.

'రిటైరవబోతున్న వాళ్ళు అనుభవించే వేదన, అంతర్మధనం మొదలైన వాటి గురించి తను యెన్నో కథలలో చదివాడు. ప్రత్యక్షంగా యెంతోమందిని చూశాడు. అందులో చాలా మంది బాధపడేది యికపైన తమకు జీతం రాళ్ళు ముట్టవనీ, పెన్షన్ డబ్బులతోటో కాలం గడపవలసి వస్తుందనిన్నూ. తన బాధ అలాంటిది కాదు.

భగవంతుని దయవలన తను ఆర్థికంగా స్థితిమంతుడే. తను యేక్షణాన 'వూ' అన్నా తనను తీసుకుపోయి తమతో వుంచుకొని ఉపచారాలు చేయడానికి తయారుగా వున్న యిద్దరు పుత్రరత్నాలున్నారు.

వాళ్ళ దగ్గరకు వెళ్ళకున్నా తమకు పెద్ద కష్టమేమీ లేదు. స్వంత యిల్లుంది. తను వద్దన్నా ప్రతినెలా కొడుకులు పంపించే డబ్బులు ఖర్చు చేసే వాళ్ళు లేక బ్యాంకులో చేరి కాపురం చేస్తూ పిల్లల్ని పెడుతున్నాయి. డబ్బు గురించి దిగులంటూ తనకు లేదుగాక లేదు.

కానీ యే వ్యాపకమూ లేకుండా, అంతకన్నా అన్ని పసిమనసుల మధ్య తిరిగే ఆనందం అనుభవించకుండా యెన్నాళ్ళు గడుపగలడు! తన కార్యాలయమూ, దేవాలయమూ అన్నీ తాను పనిచేసే పాఠశాలే తనకు. అక్కడ కూర్చుంటేనే తనకు మనస్థిమితం యేర్పడేది. అక్కడ కూర్చుంటేనే తను యెంత ముఖ్యమైన విషయంలోనైనా సరైన నిర్ణయం తీసుకోగలిగేది. అక్కడ కూర్చుని చదువుకుంటేనే తనకు యే పుస్తకంలోనైనా యేకాగ్రత కుదిరేది. తన విద్యార్థుల మొహాలలోనే తనకు మూడు కోట్ల దేవతలూ ఒక్కడుగా దర్శనమిచ్చేది. తమ పాఠశాల గేటు దాటి లోనికి అడుగిడుతున్నప్పుడే తనకు స్వర్గలోకపు వాకిలి దాటి లోనికి ప్రవేశిస్తున్న అనుభూతి కలిగేది.

తనను చూడగానే చిరునవ్వులు చిందిస్తూ నమస్కారాలు చేసే బాలబాలికలూ, తన సలహా లకోసమే తాపత్రయపడే తోటి ఉపాధ్యాయులూ, తనంటే అమిత గౌరవం చూపించే ప్రధానోపాధ్యాయుడూ...అమ్మో ! ఎన్నిటిని కోల్పోతున్నాడు తను!'

"మీరింకా లేవనేలేదూ!'' వంటింట్లోంచి కేక పెట్టింది వరలక్ష్మి.

"ఇదిగో వచ్చేస్తున్నా'' అని చిన్నగా నిట్టూర్చి, లేచి టవల్ భుజాన వేసుకొని పెరటి వైపు నడిచారు సత్యనారాయణగారు.

భోజనాదికాలు ముగించుకొని స్కూలుకు బయలుదేరబోతుండగా అప్పుడు గమనించారు తన గుండెలలో అలజడిని.

సన్నటి.... అతి సన్నటి నొప్పి. ఒక్కక్షణం గుండెలమీద చేతులతో రుద్దుకుంటూ అలాగే కుర్చీలో కూర్చున్నారు.

"అయ్యో! ఏం జరిగిందండీ?'' ఆదుర్దాగా ప్రశ్నించిన భార్యను చూసి నవ్వారాయన.

"ఫరవాలేదులే. రాత్రి సరిగ్గా నిద్రలేదు కదా! వయసు మీరుతున్నప్పుడు అటువంటి శ్రమను తట్టుకోలేదు మన గుండె. అందుకని చిన్న వార్నింగ్ యిస్తోంది'' అన్నాడు.

పదినిమిషాల విశ్రాంతి అనంతరం సర్దుకున్నారాయన. వరలక్ష్మికి సర్ది చెప్పి మామూలుగా స్కూలుకు బయలుదేరారు.

★★★

అల్లంత దూరంలో కనిపిస్తోంది తమ స్కూలు. పాఠశాల భవనాలు కనిపించగానే సత్యనారాయణగారికి అప్రయత్నంగా కళ్ళు చెమర్చాయి. ఆ రోజుతో ఆ భవనాలకూ, తనకూ ఋణం తీరిపోబోతుందన్న ఆలోచన రాగానే ఆయన గుండె బరువెక్కి, అడుగులు భారంగా పడుతున్నాయి.

స్కూల్లో అడుగుపెట్టగానే యెదురైన సహోపాధ్యాయులూ, విద్యార్థులూ ప్రతి ఒక్కరి మొహంలోనూ ఒక విధమైన విషాదంతో కూడిన



చిరునవ్వు. ఆ రోజు మామూలుగా వినిపించే కలకలం వినిపించడంలేదు, అంతా స్తబ్దంగా వున్నట్టు, అసలు స్కూల్లో యెవరూ లేనట్టు, తరగతులే జరుగనట్టు... తనకలా అనిపిస్తోందా లేక నిజంగానే అలా వుందా? వింతగా అనిపించింది.

ఆ మధ్యాహ్నం స్కూలు ఆవరణలోనే బ్రహ్మాండమైన వీడ్కోలు సభ యేర్పాటు చేశారు. ప్రధానోపాధ్యాయుడూ, ఒక్కో 'డిపార్ట్‌మెంట్' తరపున ఒక్కో ఉపాధ్యాయుడూ, యింకా విద్యార్థులూ ఆయనను పూల మాలలతో ముంచెత్తారు.


సత్యనారాయణగారి మంచితనాన్నీ, వృత్తిపై ఆయనకుగల భక్తినీ, పాఠశాలకు ఆయన చేసిన సేవలనూ పొగడుతూ, అనేకమంది వుపన్యసించారు.

అందరికీ సమాధానం చెప్పవలసిన సమయం వచ్చింది. ఆయన లేచి



## సమీరా నమ్మకం

సమీరారెడ్డి చిత్రమంటేనే కాస్త రొమాంటిక్ డాన్సులున్న పాటలు గుర్తొస్తాయి ప్రేక్షకులకి. ఆమె నటిస్తున్న హిందీ చిత్రం 'రేస్'లో మాత్రం ఆమెకి ఒక్క పాట కూడా లేకపోవడం విశేషంగానే చెప్పుకోవాలి. 'అవును, ఈ సినిమాలో నాకు ఒక్క పాట కూడా లేదు. అయినా ఈ సినిమాలో నా పాత్ర ప్రేక్షకుల్ని బ్రహ్మాండంగా ఆకట్టుకుంటుందనే నమ్మకం నాకుంది' అంటోంది సమీరా రెడ్డి. క్రమంగా గ్లామరస్ పాత్రల నుంచి నటనకు అవకాశం వుండే పాత్రల వైపు దృష్టి మళ్లిస్తోంది సమీర.




మైకు ముందు నిలబడ్డారు. రెండు మూడు వేలమంది విద్యార్థులు. అందరి కళ్లల్లోనూ తడి.

సత్యనారాయణగారికి ఏం మాట్లాడాలో తోచలేదు. ఏం చెప్పాలి? ఎలా ఓదార్చాలి యిందరు బిడ్డలను.

"అందరూ క్షమిస్తే, నేను దయచేసి కూర్చునే మాట్లాడతాను. నిలబడటానికి నా కాళ్ళు సహకరించడం లేదు" అన్నారాయన.

ఆయన కూర్చున్నారు. మైకును సర్ది ఆయనకు దగ్గరకు పెట్టారు.

"ఈ రోజు సుదినం. ఎందుకంటే మీరు యింతమంది నా మీద పెంచుకున్న అభిమానాన్నీ, గౌరవాన్నీ మీ కళ్ళల్లోనూ, మొహాల్లోనూ చూస్తున్నాను. 'ఇందరి అభిమానానికి పాత్రుడిని' అని ఒక వేదికపై నిల్చుని తెలుసుకునే అవకాశం గలిగిన నేడు సుదినం కాక మరేమిటీ?

నేడు చాలా దుర్దినం కూడా. ఇంతమంది అభిమానుల్ని వదలి, యిన్నేళ్ళు అనుబంధాన్ని తెంచుకొని నా దారి నేను చూసుకోవడానికి మీ వద్ద వీడ్కోలు పుచ్చుకోవలసిన దినం. దీన్ని దుర్దినమనక తప్పదు. భిన్న అభిప్రాయాలను కలుగజేసే యీ రోజు నన్ను యీ పాఠశాల నుండి, యీ మిత్రుల నుండి, యీ పసి హృదయాలనుండి నన్ను దూరం చేయడానికి వచ్చింది.

నా వృత్తిని గురించి రెండు ముక్కలు చెప్పాలి. పూర్వం ఉపాధ్యాయ వృత్తి చేసేవారంటే లోకువగా వుండేది. 'బ్రతక లేక బడిపంతులు' అనేవారు. ఇప్పుడు అలాకాదు. నిరంతరం శ్రమించి విద్యార్థులను తీర్చిదిద్దడానికి పాటుపడే బడిపంతుళ్ళకూ ఒక గుర్తింపు వచ్చింది. తన రక్తమాంసాలు ధారవోసి బిడ్డకు జన్మనిస్తుంది తల్లి.

ఆ బిడ్డను యే లోటూ లేకుండా పెంచడానికీ, వృద్ధిలోనికి తేవడానికి పాటుపడేవాడు తండ్రి. కేవలం వృత్తి ధర్మానికి కట్టుబడి కాక మనస్ఫూర్తిగా ఆ పిల్లల భవిష్యత్తుకు బంగారుబాట వేయడానికీ, ఆ చిన్నారుల హృదయాలలో విజ్ఞానజ్యోతులను వెలిగించడానికీ నిరంతరం శ్రమించే వాడే నిజమైన గురువు. అందుకే తల్లీ, తండ్రీ, గురువూ అన్నారు. ఎవరో కొందరు మినహాయింపు వుంటారు.

తప్పదు. నా వృత్తి పట్ల నాకు అచంచలమైన గౌరవం. వృత్తిని బట్టి ఆ వృత్తిచేసే వ్యక్తికి గౌరవం కలుగడం వేరు. వృత్తిని చేసే వ్యక్తిని బట్టి ఆ వృత్తికే గౌరవం కలుగడం సర్వేపల్లి రాధాకృష్ణన్‌గారి నుండీ నేటి అబ్దుల్ కలాంగారి దాకా చూస్తూనే వున్నాం కదా! ముప్పది యేళ్ళుగా యీ బడిలో సేవ చేశాను. ఎన్నేండ్లు సర్వీసులో వున్నారన్నది ఉపాధ్యాయ వృత్తిలో ప్రధానం కాదు. ఎందరి హృదయాలలో వెలుగులు నింపగలిగాడూ అన్నది ప్రధానం. ఆ విషయంలో నేనదృష్టవంతుడిని. అంతకన్నా యెక్కువగా చెప్పుకోలేను. రేపటి నుండి యీ పాఠశాలతో ప్రత్యక్షంగా నాకు యెటువంటి సంబంధముూలేదు. కేవలం మాజీ ఉపాధ్యాయుడుగా మాత్రమే..." అంతవరకు గంభీరంగా మాట్లాడిన సత్యనారాయణగారి కంఠం బలహీనంగా పలికింది.

"ఏండ్ల తరబడి చేసిన శ్రమను తట్టుకోవడానికి విశ్రాంతి అవసరం. అందుకే ఉద్యోగ విరమణ అంటూ పెట్టారు. కానీ విశ్రాంతిని భరించలేని వాడికి..." కుర్చీలో కూర్చుని మాట్లాడుతున్న సత్యనారాయణగారు అలాగే టేబిల్ మీదికి వొరిగిపోయారు.

చీమ చిటుక్కుమన్నా వినిపించేటంతటి నిశ్శబ్దంగా వున్న ఆ వాతావరణంలో చెప్పలేనంత గొడవ బయలుదేరింది.

అందరి మొహాల్లోనూ కంగారు. మేస్టారికేమయిందోనన్న ఆదుర్దా. కానీ సత్యనారాయణగారు తేరుకున్నారు. చేతులెత్తి అందరికీ నమస్కరించి వేదిక దిగారు.

విద్యార్థులు అందరూ ఆయనకు భారమైన మనస్సులతో వీడ్కోలు చెబుతుంటే ఆయనకు తోడుగా యిద్దరు ఉపాధ్యాయులు ఆటో రిక్షాలో ఆయనను ఇంటిదగ్గర దిగబెట్టడానికి బయలుదేరారు.

***

"రిటైర్ కాగానే నా దగ్గరికి వచ్చేయడానికి ఏర్పాట్లు చేసుకోండని చాలా సార్లు చెప్పాను. హైదరాబాదు లాంటి సిటీలో వుండటం మీకు యిబ్బందిగా వుంటుందేమో. అయితే కనీసం తమ్ముడి దగ్గరయినా వుండండి. చిత్తూరులో తమ్ముడు వుంటున్న లొకాలిటీ మీకు ప్రశాంతంగా కాలం గడపడానికి చాలా బావుంటుంది. మీరెలా నిర్ణయించుకున్నా పర్వాలేదు" అన్నాడు రాఘవ.

అతను సత్యనారాయణగారి పెద్ద కొడుకు. హైదరాబాదులో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నాడు.

తండ్రికి వొంట్లో బాగా లేదని తెలిసినా వెంటనే రాఘవా, అతని తమ్ముడు చిరంజీవి బయలుదేరి వచ్చేశారు.

చిరంజీవి చిత్తూరులో ఒక బ్యాంకులో బ్రాంచి మేనేజరుగా పని చేస్తున్నాడు.

"ఆయనకు యిప్పుడు కావలసింది విశ్రాంతి కాదు. ఆయన కిష్టమైన వ్యాపకం. ఇది డాక్టరుగారు చెప్పిన మాట" అంది వరలక్ష్మి దిగులుగా కొడుకు వంక చూస్తూ.

చిరంజీవి చిన్నగా నవ్వాడు.

"నాకు తెలుసమ్మా, నాన్నగారి కిష్టమైన వ్యాపకమేమిటో, ఏది లేకుంటే ఆయన తల్లిని విడచిన లేగ దూడలా అల్లాడుతారో మీకు మాత్రం తెలియనిదాయేమిటి ! నాన్నా! మీకు ముందే వుత్తరం రాద్దామనుకున్నాను కానీ వున్నట్టుండి చెబితే మీకు మరింత ఆనందం కలుగుతుందని వూరుకున్నాను. మన యింటి ప్రక్కనే ఒక ఆదర్శపాఠశాలను ప్రారంభించడానికి అన్నీ యేర్పాట్లు పూర్తి చేశాను. ఇక దానికి తుది మెరుగులు దిద్దడం మీ వంతు. మీరు మీ పాఠశాలను యే రకంగా తీర్చిదిద్దుకుంటారో మీ యిష్టం. మీరిన్నాళ్ళూ పనిచేసిన చోట మీరు కొన్ని పరిమితులకు లోబడి పనిచేయవలసి వచ్చేది. ఇప్పుడు మీ కలలు నిజం చేసుకోడానికి, మీ ఆదర్శాలకు ఒక రూపం యివ్వడానికి కావలసినంత అవకాశం. రేపు వుదయమే మీరు అమ్మతో సహా నాతో బయలుదేరుతున్నారు అంతే" అన్నాడు చిరంజీవి నవ్వుతూ.

రాఘవ మెచ్చుకోలుగా తమ్ముడి భుజం తట్టాడు.

సత్యనారాయణగారు చిరంజీవి చేతులను అందుకొని ఆప్యాయంగా తన చెంపలకానించుకున్నారు.

***

మరునాడే తల్లితండ్రులను తనతో బాటే తీసుకొని కారులో చిత్తూరుకు బయలుదేరాడు చిరంజీవి.

చిత్తూరులో యింటిముందు కారు దిగుతూండగానే యింటికి ప్రక్కనే వున్న మరో బుల్లి భవనాన్ని చూశారు సత్యనారాయణగారు. భవనానికి పైభాగంలో లేత యెండలో మిలమిల మెరుస్తూ కనిపించాయి బంగారువన్నె అక్షరాలు 'జ్ఞానవనం' అని.

ఆయన అలాగే చూస్తూ నిలబడ్డారు. ఆయన కళ్ళముందు ఎకరాల కొద్దీ వ్యాపించిన విశాలమైన పూలతోట కనిపిస్తున్నట్టుంది. తోటలో రంగు రంగుల పూల స్వచ్ఛమైన కాంతులు విరజిమ్ముతున్నారు. కొన్ని మొగ్గలు... కొన్ని అప్పుడే విచ్చుకుంటున్నవి.

పూర్తిగా విచ్చిన పువ్వులు రకరకాల సత్కార్యాలకు కొనిపోబడుతున్నాయి. పువ్వు పువ్వునూ చూస్తూ, పరామర్శిస్తూ మొక్కల నడుమ తీరికలేకుండా తిరుగుతున్న తాను! ఆయన కళ్ళు ఆనందంతో, ఆశ్చర్యంతో మెరుస్తున్నాయి.

ఇంటి లోపలికైనా రాకుండా అప్రయత్నంగా పాఠశాల వైపు నడిచారాయన.

ఆయన వెనుకే అనుసరించబోయిన వరలక్ష్మిని మృదువుగా వారించాడు చిరంజీవి.

తల్లీ కొడుకులిద్దరూ వున్నచోటనే నిలబడిపోయారు.

★




## ఫుట్‌బాలే మిన్న

ఇటలీవాళ్ళు సెక్స్‌కంటే ఫుట్‌బాల్‌నే ఎక్కువ ప్రేమిస్తున్నారుట. ఇంటర్‌నెట్ సెర్చి ఇంజన్ గూగుల్ నిర్వహించిన సర్వేలో ఈ విషయం వెల్లడైంది. సహచరులతో మంచం పంచుకునేకంటే క్రీడల్లో రాణించడం ఎక్కువ సంతృప్తినిస్తుందని వీళ్లు చెప్పారు. పుస్తకాలను ప్రేమిస్తున్నవాళ్లు ఇక్కడ ఎక్కువమందే ఉన్నారు.

-శ్రీసాయివల్లవి

